పాఠశాల విద్య బలోపేతానికి కృషి : ఆర్‌జెడి

ప్రజాశక్తి - రాయచోటి

పాఠశాల విద్య బలోపేతానికి ప్రభుత్వం ఎన్నో వినూతన్న కార్యక్రమాలు చేపడుతోందని ఆర్‌జెడి ఎద్దుల రాఘవరెడ్డి పేర్కొన్నారు. ఉద్యోగోన్నతిపై నూతన ప్రాంతీయ సంయుక్త సంచాలకులుగా బాధ్యతలు చేపట్టిన ఆయన్ను జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీరామ్ పురుషోత్తం, అన్నమయ్య, కడప జిల్లాల ఓపెన్ స్కూల్ కో-ఆర్డినేటర్‌లు కొండూరు శ్రీనివాసరాజుల, సుబ్బారెడ్డి గురువారం ఆర్‌జెడి కార్యాల యంలో కలిసి శాలవతోను, పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రాఘవరెడ్డి ప్రభుత్వం నిర్దేశించిన విద్యా లక్ష్యాలను సాధించుటలో ఉపాధ్యాయులు, అధికారులు ఉద్యోగులు, తల్లిదండ్రుల కమిటీల సహకారంతో ముందుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది రవీంద్ర, శ్రీధర్, రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

ఆర్‌జెడి రాఘవరెడ్డిని సన్మానిస్తున్న అధికారులు

రాజ్యసభకు 'మేడా'!

- 27న నామినేషన్‌కు కసరత్తు?
- వైసిపి కేడర్‌లో ఉత్సాహం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి/రాజంపేట అర్బన్

రాజంపేట ఎమ్మెల్యే సోదరుడు, ప్రముఖ కాంట్రాక్టర్ మేడా రఘునాథరెడ్డికి రాజ్యసభ సభ్యత్వం లభించింది. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గురువారం రాష్ట్రానికి దక్కిన మూడు రాజ్యసభ అభ్యర్థిత్వాల పేర్లను ఖరారు చేశారు. రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి సోదరుడైన రఘునాథరెడ్డి పేరు చోటుచేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఈ నెల 27న నామినేషన్ దాఖలు చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. రాజంపేట నియోజకవర్గ పరిధిలోని ఎమ్మెల్యే మేడా అభిమానులు, వైసిపి కార్యకర్తల్లో ఉత్సాహం నెలకొంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అభ్యర్థిత్వాల కోసం చేపట్టిన సర్వేల్లో వెనుకబడిన నేపథ్యంలో సమన్వయకర్తత్వాన్ని నిరాకరించారు. ఎమ్మెల్యే మేడా స్థానంలో జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డిని నియమించారు. ఇద్దరి నాయకుల మధ్య విభేదాలు, గ్రూపులు తలెత్తే అవకాశాలు ఉన్న నేపథ్యంలో ముఖ్యమంత్రి తన సొంత జిల్లాలో అధికార వైసిపి పట్టు సడలకుండా చేయడంలో భాగంగా వ్యూహాత్మకంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యే కుటుంబానికి రాజ్యసభ సభ్యత్వాన్ని ప్రతిపాదించినట్లు సమాచారం. ఎమ్మెల్యే మేడా కుటుంబీకులు, ఆకేపాటి అమరనాథరెడ్డితో సమిష్టిగా పనిచేసి ఎమ్మెల్యేగా గెలిపించుకుని రావాలని ఆదేశించినట్లు సమాచారం. ఆర్థికపరమైన ఖర్చుల దగ్గర నుంచి అసమ్మతుల సమస్యలను సమిష్టిగా పంచుకుని గెలుపే ధ్యేయంగా పని చేసే బాధ్యతల్ని అప్పగించినట్లు సమాచారం. ఇందుకు అనుగుణంగానే క్షేత్రస్థాయిలో ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, ఆకేపాటి అమరనాథరెడ్డి సమిష్టిగా ప్రచారాల్ని సైతం నిర్వహిస్తున్నట్లు ప్రచారం సాగుతుండడం గమనార్హం.

ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రఘునాథరెడ్డి

సిఎంను కలిసిన మేడా రఘునాథరెడ్డి

ప్రముఖ పారిశ్రామికవేత్త మేడా రఘునాథరెడ్డి గురువారం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చారు. వైసిపి అధిష్టానం తనను రాజ్యసభ అభ్యర్థిగా ఎంపిక చేసినందుకు కృతజ్ఞతలు తెలిపి హర్షం వ్యక్తం చేశారు. జగన్ తనపై ఉంచిన నమ్మకం వమ్ము చేయకుండా పార్టీకి సేవ చేస్తామన్నానని తెలిపారు.

నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరు

- సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు
- అరెస్టులకు నిరసనగా ఆశాల ధర్నా
- మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం

ప్రజాశక్తి-మదనపల్లి

నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు అన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆశా వర్కర్లు చలో విజయవాడ కార్యక్రమానికి రాకుండా ఎక్కడికక్కడ జిల్లాల్లో నోటీసులిచ్చి అరెస్టు చేయడాన్ని ఖండించారు. సమస్యలు పరిష్కరించాలని కోరిన ఆశా వర్కర్లను ఎక్కడికక్కడ అరెస్టు చేసి నిర్బంధించడం సిగ్గుచేటన్నారు. సమస్యలు చెప్పుకుందామని విజయవాడ బయలుదేరిన ఆశా కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ గురువారం మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన ధర్నా నిర్వహించారు. ముందుగా గాంధీ విగ్రహం ముందు నిరసన చేసి వినతిపత్రం అందించి అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. నిరసనకు సంఘీభావాన్ని తెలిపిన సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ వైద్య, కుటుంబ ఆరోగ్య శాఖ అధికారులు చర్చలకు రావాలని పిలిచి, అనంతరం రాత్రి 7.30 గంటలకు యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మిని అరెస్టు చేయడం, ప్రభుత్వ అప్రజాస్వామిక వైఖరికి అద్దం పడుతోందని పేర్కొన్నారు. ఆశా వర్కర్లు కనీస వేతనం, సెలవులు, మెటర్నటీ లీవులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పనిభారం తగ్గించాలని తదితర కోర్కెలతో గత కొంతకాలంగా ఆందోళన చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రశాంతంగా ధర్నాకు వస్తున్న ఉద్యోగుల కోర్కెలు పరిష్కరించకుండా వారిని పోలీసులు అరెస్టు చేసి శాంతిభద్రతల సమస్యగా చేయడం సరైంది కాదని విమర్శించారు. ప్రభుత్వం ఆశా వర్కర్స్ నాయకులను పిలిచి చర్చించి వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సవిత మాట్లాడుతూ 20 ఏళ్లుగా పేద ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్న ఆశా వర్కర్స్‌ని ప్రభుత్వం కార్మికులుగా గుర్తించాలని తెలిపారు. ఇతర సౌకర్యాలను కల్పించాలని దీర్ఘకాలంగా పని చేస్తున్న ఆశా వర్కర్స్‌కు కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సంబంధం లేని పనులు చేయించరాదని కోరారు. 60 సంవత్సరాలు వయస్సు వచ్చేవరకు పనిచేయించుకొని ప్రభుత్వం రిటైర్మెంట్ బెనిఫిట్స్ సౌకర్యం కల్పించకుండానే తొలగించటం సరైంది కాదని విమర్శించారు. 62 సంవత్సరాల రిటైర్మెంట్ జిఒ వర్తింప చేయాలని తెలిపారు. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు, అనారోగ్యంతో చాలా మంది ఆశా వర్కర్లు అర్ధాంతరంగా చనిపోతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఆశా వర్కర్స్కు గ్రూప్ ఇన్సూరెన్సు సౌకర్యం కల్పించాలని కోరారు. లేకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎఒ రఫిక్ అహ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తల సంఘం నాయకులు రామామణి, వసంతమ్మ, సుజాత, మంజుల, మల్లీశ్వరి, విమల, లక్ష్మిదేవి పాల్గొన్నారు.

మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న ఆశా వర్కర్లు

నిష్పక్షపాత ఎన్నికలకు కలిసి పనిచేద్దాం : కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

ప్రజాశక్తి - రాయచోటి

నూతనంగా ఏర్పడిన అన్నమయ్య జిల్లాలో స్వేచ్ఛాయుత నిష్పక్షపాత ఎన్నికలకు కలిసి పనిచేద్దామని కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ రాజకీయ పార్టీ ప్రతినిధులతో పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో ఓటరు జాబితా, ఎన్నికల నిర్వహణ అంశంపై రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొత్త జిల్లాలో తొలిసారిగా నిర్వహిస్తున్న ఎన్నికలకు అందరి సహకారం ఉండాలన్నారు. ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను నిబంధనలను తూచా పాటించి నిష్పక్షపాత పారదర్శకంగా ఎన్నికల నిర్వహించడంలో కలిసి ముందుకు సాగుదాం అన్నారు. గత అక్టోబర్లో ముసాయిదా ఓటర్ జాబితా ప్రచురించినప్పుడు జిల్లాలో 13,58,165 మంది ఓటర్లు ఉన్నారు. ఏడాది జనవరి 22న తుది జాబితాను ప్రచురించినప్పుడు 14,02,808 మంది ఓటర్లు నమోదయ్యారని చెప్పారు. ఇందులో 3.18 శాతం పెరిగి 82,952 మంది అదనంగా నమోదు కాగా 38, 309 మందిని తొలగించారని తెలిపారు. తుది ఓటర్ జాబితా ప్రచురణ అనంతరం సుమారు 16 వేల దరఖాస్తులు వచ్చాయని వాటన్నింటినీ త్వరగా పరిశీలన పూర్తి చేసి పరిష్కరించాలని నియోజకవర్గ ఇఆర్‌ఒలను ఆదేశించామని చెప్పారు. చేర్పులు, తొలగింపులు, సవరణలతో ఓటరు జాబితాను స్వచ్ఛీకరించడంలో జిల్లా యంత్రాంగం మొత్తం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది. ఈ ప్రక్రియలో రాజకీయ పార్టీలు కూడా భాగస్వామ్యం కావాలి. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. జిల్లాలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వివరాలను కూడా రాతపూర్వకంగా అందజేయాలని రాజకీయ పార్టీలను కలెక్టర్ కోరారు. సమస్యాత్మక కేంద్రాలలో వెబ్ కాస్టింగ్, మైక్రో అబ్జర్వర్, అదనపు బలగాలు ఉంటాయన్నాపరు. ఈసారి ప్రతి సమస్యత్మక పోలింగ్ కేంద్రంలో నిర్వహించే పోలింగ్ సరళిని సిసి కెమెరా వెబ్ కాస్టింగ్ విధానంలో రాష్ట్ర ఎన్నికల సంఘం స్వయంగా పర్యవేక్షణ చేస్తుందని పేర్కొన్నారు. జిల్లాలో ఇంకా ఓటర్లుగా నమోదుకాని వారు, 18-19 సంవత్సరాల యువత ఫామ్ 6 లో ఓటరు నమోదుకు నేరుగా లేదా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ కోరారు. ఈ సందర్భంగా తుది జాబితా ప్రచురణ అనంతరం ఒకే ప్రాంతం నుంచి ఎక్కువ తొలగింపులు వస్తున్నాయని, ఒకే వ్యక్తి పేరుతో రెండు మూడు చోట్ల ఓట్లు ఉన్నాయని, అలాగే డూప్లికేట్, డబుల్ ఓట్లు ఉన్నాయని వాటన్నిటిని సరి చేయాలని రాజకీయ పార్టీ ప్రతినిధులు కలెక్టర్‌ను కోరారు. అలాంటి వాటిపై స్పష్టమైన ఆధారాలతో రాత మూలకంగా అందజేస్తే శతస్థాయిలో పరిశీలించి వాటిని సరి చేయడానికి తప్పనిసరిగా కృషి చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం వివిధ అంశాలలో రాజకీయ పార్టీ ప్రతినిధులు వెలిబుచ్చిన సందేహాలకు కలెక్టరు సమాధానాలు ఇచ్చారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డిఆర్‌ఒ సత్యనారాయణ, రాయచోటి, రాజంపేట, మదనపల్లి ఆర్‌డిఒలు రంగస్వామి, మోహన్‌రావు, హరిప్రసాద్, ఇఆర్‌ఒలు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజ్ఞా వికాస పరీక్ష విజయవంతం : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రశ్నపత్రాలను విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లి

స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్, విజయభారతి స్కూళ్లలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ప్రజ్ఞా వికాస పరీక్షకు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ తెలిపారు. విజయ భారతి స్కూల్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.సేతు, జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు చేతుల మీదుగా ప్రశ్నాపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా విజయ భారతి స్కూల్ ప్రిన్సిపల్ డాక్టర్ సేతు మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ ప్రజ్ఞా వికాస పరీక్షను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎస్ఎఫ్ఐ అంటే విద్యార్థుల కోసం పోరాడే సంఘం మాత్రమే కాదు విద్యార్థుల ప్రతిభను వెలికి తీసి వారిని ఉన్నతమైన బాటలో నడిపించే ఒక గొప్ప సంఘంగా అభిప్రాయపడ్డారు. పదవ తరగతి విద్యార్థులు ఏ విధంగా పబ్లిక్ ఎగ్జామ్ రాయాలో వారికి తెలియజేస్తూ పరీక్షలకు ఏవిధంగా సన్నద్ధం కావాలో తెలియజేశారు. యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు సుధాకర్ నాయుడు మాట్లాడుతూ పరీక్షలకు ఏ విధంగా చదివితే మంచి మార్కులు సాధించొచ్చు చెప్తూ ఒక ఉన్నతమైన విద్యార్థిగా మారాలంటే ఏ విధంగా చదవులో విద్యార్థులు ఎలా రాణించాలో క్రమశిక్షణతో కూడిన విద్య మనిషికి ఎంత అవసరమో తెలియజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ మాట్లాడుతూ ప్రయివేట్ కార్పొరేట్ విద్యా సంస్థలు రాష్ట్రంలో ఎక్కువ ఆయి ప్రభుత్వ బడులు కళాశాలల ప్రభుత్వ విద్యారంగం కుదేలయ్యిందన్నారు. కావున విద్యార్థులందరూ ప్రభుత్వ పాఠశాలలో మాత్రమే చదివి మంచి మార్కులు సాధించి ప్రభుత్వ విద్యాలయాలు ప్రయివేట్ కార్పొరేట్ వాటి కంటే తక్కువ ఏమి కాదని నిరూపించాలని విద్యార్థులను కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు జి.కార్తీక్, విష్ణు, ఎస్‌టియు రాష్ట్ర కార్యదర్శి ఆర్.వి.రమణ, బావాజాన్, పుణ్యవతి, అన్వర్ బాషా నాగరాజు, స్వరూపరాణి, మోహన్‌రావు, సోమశేకర్ నాయుడు, ముబరక, విజయ, శ్రీరామచంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయచోటి టౌన్: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రజ్ఞా వికాస పరీక్ష పదవ తరగతి నమూనాను స్థానిక బాలికల పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జాబీర్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రమణ మాట్లాడుతూ విద్యార్థులకు పరీక్షలు అంటే భయం పోవడానికి ఎస్ఎఫ్ఐ చేస్తున్న కార్యక్రమానికి అభినందిస్తున్నామని చెప్పారు. విద్యార్థులు అందరూ సమయస్ఫూర్తితో పరీక్షలు రాయాలని సూచించారు. పరీక్షల సమయంలో ఆరోగ్యం పట్ల జాగ్రత్త తీసుకోవాలని బాహ్య ఆహార పదార్థాలు తినకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. విద్యార్థులు పట్టుదల శ్రద్ధతో పరీక్షలన్నీ రాయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు హరి, గణేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇన్వర్టర్ వితరణ చేస్తున్న జనసేన నాయకులు

బిసి బాలికల వసతి గృహానికి ఇన్వర్టర్ వితరణ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

సరిగా విద్యుత్ సరఫరా లేక విద్యుత్ కోతల వలన తమ చదువుకు ఇబ్బంది కలుగుతుందని పట్టణంలో బాలికల బిసి వసతి గృహంలో బాలికలు ఎదుర్కొంటున్న తమ సమస్యను రాజంపేట జనసేన నాయకులు బాలసాయి కృష్ణకు తెలపడంతో నియోజకవర్గం జనసేన నాయకులు అతికారి కృష్ణ దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఆర్థిక సహకారంతో జనసేన నాయకులు గురువారం ఇన్వర్టర్ సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి నేతృత్వంలో నడుస్తున్నా ప్రభుత్వం కేవలం ప్రచార ఆర్భాటం తప్ప బడుగు, బలహీన వర్గాల, పేద ప్రజలకు, పేద విద్యార్థులకు చేసింది శూన్యమన్నారు. దానికి ఉదాహరణ ఈ హాస్టల్లోని వసతులలేమి స్పష్టం చేస్తోందన్నారు. రాబోయే జనసేన, తెలుగుదేశం ఉమ్మడి ప్రభుత్వంలో విద్యార్థుల హాస్టల్‌లో మెరుగైన సౌకర్యాలు ఏర్పాటు చేసి విద్యార్థుల అభివృద్ధి కోసం తోడ్పడుతామని తెలిపారు. కార్యక్రమంలో రాజంపేట జనసేన నాయకులు కోలాటం హరికృష్ణ, నంద్యాల హరి, బండ్ల నాగరాజు, అబ్బిగారి గోపాల్, ముత్యాల చలపతి, పూల మురళి, వైశ్య యువజన సంఘం అధ్యక్షుడు రాజ, శరత్ పాల్గొన్నారు.

సమస్యలు తలెత్తకుండా చూడాలి : ఇఆర్‌ఒ

ప్రజాశక్తి-పీలేరు

2024లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఇఆర్‌ఒ రమ తెలిపారు. గురువారం స్థానిక సిఎల్ఆర్సీ భవనంలో నియోజక వర్గానికి కొత్తగా ఇఆర్‌ఒ బాధ్యతలు చేపట్టిన ఆమె నియోజకవర్గం పరిధిలోని 6 మండలాలకు ఎన్నికల బదిలీపై కొత్తగా వచ్చిన తహశీల్దారులతో పరిచయ కార్యక్రమంతో పాటు ఎన్నికల నిర్వహణపై బూత్ లెవెల్ అధికారులు, బూత్ లెవెల్ సూపర్వైజర్లు, సెక్టోరియల్ అధికారులుతో శిక్షణ కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా బిఎల్‌ఒల విధులు, పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించాల్సిన బాధ్యతలు, సౌకర్యాలు, కొత్త క్లైముల విచారణ తీసుకోవలసిన జాగ్రత్తలకు గురించి వారికి సూచనలు సలహాలు ఇచ్చారు. సమావేశంలో ఎఎస్‌ఒ రామ్మోహన్, పీలేరు, కలికిరి, వాల్మీకిపురం, కెవి.పల్లి, కలకడ, గుర్రంకొండ మండలాల తహశీల్దా రులు మహ బూబ్ బాష, విజయ కుమారి, ఖతీజా కుబ్రా, నయాజ్ అహ్మద్, ప్రదీప్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రమ

వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రణాళికలు : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకొని జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం విజయవాడ నుంచి రెవెన్యూ సేవలు, రీసర్వే మూడవ దశ, ఇనామ్ అండ్ అసైన్డ్ భూములు, ఎంఎస్ఎంఇల క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రాం, నవరత్నాలు పేదలందరికీ ఇళ్ళు, పోలింగ్ కేంద్రాలలో కనీస సౌకర్యాలు కల్పన తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డిఆర్‌ఒ సత్యనారాయణ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే వేసవి దృష్టిలో ఉంచుకొని తాగునీటి ఎద్దడిని ఎదుర్కొనేలా తగిన ప్రణాళికలు రూపొందించాలన్నారు. జగనన్న లేఅవుట్ కాలనీలలో ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై హౌసింగ్ పీడీతో సమీక్షించారు. గత సంవత్సరం జూన్, జూలైలలో అడ్వాన్స్ పేమెంట్లు తీసుకున్న లబ్ధిదారులతో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సచివాలయ కార్యదర్శులు వాలంటీర్లు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ప్రస్తుత దశ నుంచి తదుపరి దశకు ఇండ్ల నిర్మాణాన్ని తీసుకువెళ్లాలన్నారు. ఇంకను ప్రారంభం కానీ ఇళ్ళు, బిబిఎల్ దశలో ఉన్న వాటిని బిఎల్ స్థాయికి తీసుకురావాలని ఇందుకు ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు తగిన ఆదేశాలు జారీ చేయాలని చెప్పారు. వ్యక్తిగత మరుగుదొడ్లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. విధులలో నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. రెవెన్యూ అంశంలో భాగంగా చుక్కల భూములు, ఇనాం భూములను మార్గదర్శకాల మేరకు పరిష్కరించాలన్నారు. కరువు ఉన్న మండలాలలో ఉపాధి హామీ పనులు ఎక్కువగా కల్పించేలా దృష్టి సారించాలని డ్వామా పీడీకి సూచించారు. జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను పటిష్టంగా నిర్వహించాలన్నారు. రీ సర్వే పూర్తయిన గ్రామాలలో హద్దురాళ్ళు నాటే లక్ష్యాలను సాధించాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు కనీస సౌకర్యాలు ఉండాలని ముఖ్యంగా ర్యాంపు, మరుగుదొడ్డి తప్పనిసరిగా ఉండాలన్నారు. ప్రభుత్వ పథకాలు అమలులో లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

విసిలో పాల్గొన్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, అధికారులు

'మిట్స్'ను సందర్శించిన ఎన్‌సిసి కమాండర్

ఎన్‌సిసి విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న కమాండర్

ప్రజాశక్తి-మదనపల్లి

మిట్స్ కళాశాలను తిరుపతి ఎన్‌సిసి గ్రూప్ హెడ్ క్వార్టర్స్ ఎన్‌సిసి గ్రూప్ కమాండర్ కల్నల్ వై.డుంగ్రకోటి సందర్శించారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ తెలిపారు. ఎన్‌సిసి క్యాడెట్స్‌ను ఉద్దేశించి వై.డుంగ్రకోటి మాట్లాడుతూ ఎన్‌సిసి ఉద్దేశ్యం విద్యార్థులను పాఠశాల దశ నుంచే సైన్యంలో చేరేలా ప్రోత్సహించమన్నారు. యువతలో సైన్యం పట్ల అవగాహన కల్పించేందుకు, సైనిక స్థాయిలో వారిని సిద్ధం చేసేందుకు ఇది ఏర్పడిందని పేర్కొన్నారు. ఎన్‌సిసి శిక్షణ ద్వారా విద్యార్థులలో ధైర్యసాహసాలు, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, లౌకిక దృక్పథం, సాహసం, క్రీడాస్ఫూర్తి, నిస్వార్థ సేవా భావాలు పెంపొందించబడతాయని పేర్కొన్నారు. శిక్షణ సమయంలో విద్యార్థులకు డ్రిల్, షూటింగ్, ఫిజికల్ ఫిట్నెస్, మ్యాప్ రీడింగ్, ఫస్ట్ ఎయిడ్, గ్లైడింగ్, బోట్ పుల్లింగ్, సెయిలింగ్‌తో పాటు క్యాంప్ ట్రైనింగ్‌లో ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ అవసరాలకు తగ్గట్లు ప్రాథమిక సైనిక శిక్షణ ఇస్తారని తెలిపారు. వీటిపై విద్యార్థులకు అవగహన పెంచి, విద్యార్థులలో యెన్.సి.సి పై చైతన్యం నింపి ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న టెక్నాలజీకి తగ్గట్టుగా ఎన్‌సిసి క్యాడెట్స్‌కు ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్, డ్రోన్ టెక్నాలజీ, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ రంగాలల్లో, దేశ రక్షణకు కావలిసిన పరిశోధనలు చేసే వీలు కూడా కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఇంటెర్న్‌షిప్ రూపంలో ఇస్రో, డిఆర్‌డిఒ లాంటి సంస్థలో అవకాశాలు కూడా ఇస్తున్నాయని ఆయన గుర్తుచేశారు. బి.టెక్ చదువుతున్న ఎన్‌సిసి క్యాడెట్స్‌కు ఎస్ఎస్‌బి, ఎన్‌సిసి స్పెషల్ ఎంట్రీ స్కీం ద్వారా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడానికి అవకాశం ఉందని పేర్కొన్నారు. మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌సిసి క్యాడెట్స్ సాధించిన విజయాలకు ఆయన ప్రశంసల వర్షం కురిపించారు. కార్యక్రమంలో ఎన్‌సిసి కల్నల్ అజయ్ బాస్నెట్, ఆఫీసర్ కమాండెంట్, మేజర్ టి.లోగనాథన్ ఆడమ్ ఆఫీసర్, 35 ఆంధ్ర బెటాలియన్, చిత్తూర్, లెఫ్ట్ నెంట్ కల్నల్ సంజయ్, తిరుపతి గ్రూప్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్, లెఫ్ట్ నెంట్ డాక్టర్ నవీన్ కుమార్, ఎన్‌సిసి విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసరావు

ప్రజా ఆరోగ్యంపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - రాయచోటి

పట్టణ పారిశుధ్యం, ప్రజారోగ్యం కాపాడే విషయంలో నిత్యం అప్రమత్తంగా ఉండాలని వార్డు శానిటేషన్ కార్యదర్శులను కమిషనర్ శ్రీనివాసరావు ఆదేశించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో శానిటేషన్ విభాగం అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. పట్టణంలో దోమల నివారణ కు మలాథిన్ స్ప్రే, మురుగు నీటి నిల్వలలో దోమల నివారణకు ఆయిల్ బాల్స్ వేయించాలని ఆదేశించారు. ప్లాస్టిక్ వాడకం తగ్గే విధంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రతి దుకాణదారుడు ట్రేడ్ లైసెన్స్ తప్పక తీసుకోవాలని కోరారు. సమీక్షలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కొండయ్య, వార్డు శానిటేషన్ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంబిఎ ఫలితాల్లో 'సాయి' విద్యార్థుల విజయకేతనం

ప్రజాశక్తి-రాయచోటి

ఎంబిఎ మొదటి, రెండవ సంవత్సరం సెమిస్టర్ ఫలితాల్లో శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచి అత్యధిక ఉత్తీర్ణత శాతం సాధించారని శ్రీ సాయి విద్యా సంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం. సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జి. ముబీనా 84.55 శాతంతో మొదటి ర్యాంకు, కె. రుచిత, పి. యశస్విని 81.55 శాతంతో రెండవ ర్యాంకు , బి. పద్మావతి 80.88 శాతంతో మూడో ర్యాంకు సాధించారని తెలియజేశారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులను ఫలితాల సాధనలో భాగమైన అధ్యాపకులను అభినందిస్తూ, ప్రతి ఒక్కరికి ఉద్యోగ ఉపాధి భరోసా కల్పించడానికి మౌలిక వసతులు కల్పిస్తున్నామని వివరించారు. వీరిని ఆదర్శంగా తీసుకుని మిగిలిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని దిశానిర్దేశం చేశారు. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని అంకితభావంతో కృషి చేయాలిన్నారు. క్రమశిక్షణతో ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత స్థానాన్ని అధిరోహించాలని సూచించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి. బాలాజీ ఎంబిఎ విభాగాధిపతి కొత్తపల్లి ఇంతియాజ్ వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

జంగం కులస్తుల ఐక్యత కోసం పాటుపడుతా

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

జంగం కులస్తుల ఐక్యత కోసం కృషి చేస్తానని రాష్ట్ర జంగం సంఘం నాయకులు ఉమాపతి పేర్కొన్నారు. గురువారం రాయచోటి పట్టణ కేంద్రంలో జంగం సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జంగం కులస్తులు ఐక్యమత్యం కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జంగం సంఘం నాయకులు నాగేశ్వర, బాలయ్య, రవి, శంకర పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందిస్తున్న సర్పంచ్ వెంకటరెడ్డి

విజేతలకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి-కలికిరి

ఆడుదాం ఆంధ్ర డివిజన్ స్థాయి వాలీబాల్ పోటీలో మండలంలోని గుట్టపాలెం గ్రామపం చాయతీకి ఆటగాళ్లు కెప్టెన్ పి.శ్రీకాంత్, వైస్ కెప్టెన్ షాతాఫ్ వారి జట్టు విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా విజేతలుగా నిలిచి క్రీడాకారులకు స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి వేంపల్లి నూర్జ హాన్, సర్పంచ్ రెడ్డి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో బహుమతులు ప్రదానం చేసినట్లు పంచాయతీ సెక్రటరీ గోపి తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ క్రీడాకారుల్లోని నైపుణ్యాన్ని వెలికి తీసుక వచ్చేందుకు ముఖ్య మంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని అన్నారు. క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని అన్నారు. గుట్టపాలెం యువకులు మంచి నైపుణ్యం ప్రదర్శించి ప్రథమ స్థానం సాధించినందుకు వారికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఐగా దిలీప్‌కుమార్ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

బి.కొత్తకోట పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా దిలీప్ కుమార్ గురువారం బాధ్య తలు చేపట్టారు.ఇటీవల బి.కొత్త కోట పోలీస్ స్టేషన్ అప్‌గ్రేడ్ అయిన విషయం విధితమే. సిఐ స్థాయి అధికారిని నియమించాల్సి ఉండగా డిఎస్‌పి శిక్షణ పూర్తి చేసుకున్న జి.ఎస్.ప్రశాంత్‌ను ప్రభుత్వం ఎస్ హెచ్‌ఒగా నియమించింది. ఇటీవల పోలీసు అధి కారుల బదిలీల్లో భాగంగా జి.ఎస్.ప్రశాంత్ డిఎస్‌పి పదోన్నతి పొంది బదిలీ అయ్యారు. నూతన సిఐ, ఎస్ఐలను నియమించారు. సిఐగా సూర్యనారాయణ ఇటీవల బాధ్యతలు చేపట్టగా, ఎస్ఐగా దిలీప్‌కుమార్ విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్ర తల పరిరక్షణకు అధిక ప్రాధాన్యతనిస్తామని, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి వారి సంరక్షణే ధ్యేయంగా పనిచేస్తానని అన్నారు. అక్రమ మద్యం రవాణా, నాటు సారా తయారీ,విక్రయాలు, నేరాలపై ఉక్కుపాదం మోపు తామని స్పష్టం చేశారు.

నాడు-నేడు పనులు త్వరగా పూర్తి చేయండి

ప్రజాశక్తి-గాలివీడు

నాడు-నేడు పనులు రెండో విడత సంవత్సరం పూర్తి కావస్తున్న సందర్భంలో ఈ ఏడాదిలోపు పూర్తి కావాల్సినవి పూర్తి చేయాలని ఎంఇఒలు నాగ రాజు, వల్లపు శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాల ఆవరణంలో ఏర్పాటుచేసిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో వారు మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం నాడు-నాడు ఫేషియల్ యాప్ జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. బాలికల ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలు పద్మావతి భర్త మృతితో పాఠశాల ఉపాధ్యాయ ఉపా ధ్యాయులు నివాళులర్పించారు. కార్యక్ర మంలో ప్రధానోపాధ్యాయులు దుర్గేశ్వర రాజు, మహమ్మద్‌గౌస్, ఉపాధ్యాయులు వెంకటచలపతి, జయన్న, ఉపేంద్ర పాల్గొన్నారు.

చేప పిల్లలను విడుదల చేస్తున్న అధికారులు

సోమశిల వెనుక జలాల్లో చేప పిల్లలు విడుదల

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని కోనాపురం గ్రామంలోని సోమశిల వెనుక జలాలలో గురువారం డిఎఫ్ఒలు సుస్మిత, ఇరిగేషన్ ఇఇ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో 15.60 లక్షల చేప పిల్లలను సోమశిల వెనుక జలాలలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద 40 శాతం సబ్సిడీతో పలమనేరు, కృష్ణా పురం, చిత్తూరు జిల్లా, కళ్యాణదుర్గం, తిరుపతి జిల్లా నుండి 15.60 లక్షల చేప పిల్లలు తెప్పించి విడుదల చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌డిఒలు ఆర్.రాంమోహన్, జె.వి.రమణ, ఎం.ప్యాని, సుబ్బనరసయ్య, మత్స్యకారులు పాల్గొన్నారు.

మార్చి 9న జాతీయ లోక్ అదాలత్ : జడ్జి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు



మాట్లాడుతున్న జడ్జి కె.లత

మార్చి 9వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిం చనున్నట్లు ఎఫ్ఎసి జూనియర్ సివిల్ జడ్జి కె.లత పేర్కొన్నారు. నంద లూరు జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులో జడ్జి కె.లత జాతీయ లోక్ ఆదాలత్ సంబంధించి రాజీ పడదగిన క్రిమినల్ కేసులు పరిష్కరించాలని అధికారులకు తెలిపారు. జాతీయ లోక్ ఆదాలత్ సంబంధించి ప్రతి రోజూ ఫ్రీ లోక్ అదాలత్ సిటింగ్స్ నిర్వహించబడుతుందని తెలిపారు. కార్యక్రమంలో కోడూరు టౌన్ సిఐ బాబు, ఓబులవారిపల్లె ఎసఐ చిన్నపెద్దయ్య, కోడూరు ఎస్ఐబి ఎస్ఐ భాస్కర్, కోర్టు కానిస్టేబుళ్లు, కోర్టు సిబ్బంది, పాల్గొన్నారు.

అన్నదానాన్ని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మహాశివరాత్రి సందర్భంగా మల్లయ్య కొండపై జరిగే ఉత్సవాలకు సుదూర ప్రాంతాల నుండి వచ్చే యాత్రికులకు ప్రతి ఏడాది లాగే అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కమిటీ చైర్మన్ రమణారెడ్డి కోరారు. గురువారం ఐటిఐ ఎదురుగా ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద అన్నదానం కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షులు రమణారెడ్డి మాట్లాడుతూ మల్లయ్య కొండ కింద అన్నదాన కార్యక్రమానికి అందరూ సమిష్టిగా ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. లక్షలాది మందికి ఈ అన్న సంతర్పణ చేయడం మల్లయ్యకొండస్వామి ఆశీస్సులతోనే దిగ్విజయంగా జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

బిటి కళాశాలను యూనివర్సిటీగా ప్రకటించలేదు

ప్రజాశక్తి-మదనపల్లి

బిటి కళాశాలను యూనివర్సిటీగా ప్రకటించామని తప్పుడు ప్రచారం అని ఇది కేవలం ఎన్నికల ఎత్తు గడలో భాగమేనని విద్యార్థి సంఘాలు గురువారం కళాశాల గేటు దగ్గర ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బిటి కళాశాలను యూనివర్సిటీగా ప్రకటిస్తే అధికార ప్రకటన ఏదని ప్రశ్నించారు. వైసిపి ప్రభుత్వం మదనపల్లికి చేసిన ద్రోహాన్ని మభ్యపెట్టడానికే బిటిసి యునివర్సిటీ అంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కళాశాల పై అంత చిత్తశుద్ధి ఉంటే కళాశాలను తెరిపించాలన్నారు.వైసిపి ప్రభుత్వం మదనపల్లికి జిల్లా విషయంలో తీవ్రమైన అన్యాయం చేసిందని, ఈ నాలుగు నియోజకవర్గాల్లో వైసిపి ప్రభుత్వానికి వేతిరేకత ఎక్కువగా ఉందని అన్నారు. ఎన్నికల్లో డిపాజిట్లు దక్కవని బిటి కళాశాల యునివర్సిటీ అనే అంశాన్ని తెరపైకి తెస్తుందని అన్నారు. ధర్నాలో ఎఐఎస్ఎఫ్ నాయకులు మాధవ్, ఆర్ఎస్‌యు నాయకులు ఉత్తన్న, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు ప్రభాకర్ బిసివై నాయకులు సురేష్ యాదవ్, సిపిఐ మురళీ పాల్గొన్నారు.

వైసిపి ఎన్నికల కరపత్రంలా 'బడ్జెట్' : 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేట: మాట్లాడుతున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో అంకెలను మసి బూసి మారేడు కాయ చేశారని, బడ్జెట్ వైసిపి కరపత్రంలా ఉందని టిడిపి రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నారు. గురువారం రాజంపేట పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ.2,86,389కోట్ల అంచనాలతో ఓటాన్ ఎకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టారని, బడ్జెట్‌లో కొత్తదనం లేదని, ఎన్నికలు సమీపిస్తుండడంతో ఐదేళ్లలో ఎన్నో చేసేశామంటూ తమ భుజాలు తాము చరుచుకునేందుకే బడ్జెట్ అవకాశాన్ని వినియోగించకున్నారని అన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 2.79 లక్షల కోట్లు ఉన్న బడ్జెట్ అంచనాలను వచ్చే ఆర్థిక సంవత్సరంలో 2,86 లక్షల కోట్లకు స్వల్పంగా పెంచారని, 2023-24 ఆర్థిక సంవత్సరంలో వాస్తవాలను మించి అంచనాలు సమర్పించడం అందుకు తగ్గట్టుగా ఆర్థిక గణాంకాలు లేకపోవడంతో పెద్దగా మార్పులు చేయకుండానే బడ్జెట్‌ను మమ అనిపించారన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గన్నే సుబ్బ నరసయ్య నాయుడు, మండల పార్టీ ఉపాధ్యక్షులు ఆర్.సతీష్ రాజు, ఒంటిమిట్ట శివారెడ్డి, యువ నాయకులు పరుశురాం నాయుడు, నల్లగొండు గంగిరెడ్డి, మైనారిటీ నాయకులు రంతూ పాల్గొన్నారు.**మదనపల్లి :** ఆర్థిక మంత్రి బుగ్గన బడ్జెట్‌లో అంతా అంకెల గారడీనేనని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి దొమ్మలపాటి రమేష్ పేర్కొన్నారు. యాత్ర-2 సినిమాపై కొత్త జిఒ తీసుకువచ్చి ప్రభుత్వ ఉద్యోగులకు హాఫ్ డే సెలవు ప్రకటించి తప్పకుండా సినిమా చూడాలని, సినిమాకి వాలంటీర్లు కనీసం పది మంది జనాన్ని తీసుకురావాలని సూచించడం, అధికారులను సినిమా చూపించండి అంటూ జిఒ పంపడం ఏమిటని మండిపడ్డారు. కార్యక్రమంలో పట్టణ అధ్య క్షులు జోలే పాలెం భవానిప్రసాద్, ఉపాధ్యక్షులు యర్రబల్లి వెంకటరమణ రెడ్డి, పొలిటికల్ మేనేజర్ కత్తి లక్ష్మన్న, మేకల రెడ్డిశేఖర్, మాకినేని చంద్రశేఖర్, పురుషోత్తం, కాశీ శ్రీరామ్, పసుపులేటి శ్రీనివాసులు, ప్రకాష్ నాయుడు పాల్గొన్నారు. **రైల్వేకోడూరు :** బుగ్గన బడ్జెట్ అంచనాలు కొండంత ఖర్చులు గోరంత అని టిడిపి ఇన్‌ఛార్జి కస్తూరి విశ్వనాధ నాయుడు పేర్కొన్నారు. రూ.13వేల కోట్ల రూపాయలు రెవిన్యూ లోటును రూ.44 వేల కోట్లకు, రూ.35 వేల కోట్ల ద్రవ్య లోటును రూ.60 వేల కోట్ల రూపాయలకు పెంచిన ఘనత బుగ్గనదే అని విమర్శించారు. రిజిస్ట్రేషన్ ఛార్జీలు భారీగా పెంచిన ఘనత జగన్‌రెడ్డి సర్కార్‌దేనని అన్నారు. 2019లో టిడిపి తీసుకున్న దాని కంటే నాలుగు రెట్లు ఎక్కువ అప్పు వైసిపి ప్రభుత్వం చేసిందన్నారు. సమావేశంలో పుల్లంపేట మండల పార్టీ అధ్యక్షులు సుధాకర్, రాజంపేట పార్లమెంట్ టిడిపి ఉపాధ్యక్షులు పుల్లేల రమేష్, తుంగా నవీన్, క్లస్టర్ ఇన్‌ఛార్జి కాపేర్ల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సమస్యాత్మక కేంద్రాలపై దృష్టి పెట్టండి : సిఐ

ప్రజాశక్తి-ములకలచెరువు

సిబ్బందితో మాట్లాడుతున్న సిఐ తమ్మిశెట్టి మధు

సమస్యత్మక కేంద్రాలపై ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని ములకలచెరువు సిఐ తమ్మిశెట్టి మధు సిబ్బందికి సూచించారు. గురువారం సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు, ఎఎస్ఐలు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని సమస్యాత్మకంగా ఉన్న పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల అధికారులతో కలిసి ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా జాగ్రత్తలు చేపట్టా లని సూచించారు. అంతేకాకుండా చెక్‌పోస్టులలో తనిఖీలు ముమ్మరం చేయాలని సూచించారు. రాష్ట్ర సరిహద్దులో ఉన్న చెక్ పోస్టులలో అనుమతి లేని వస్తువులు తర లిస్తే కేసులు నమోదు చేయాలని కోరారు. అనంతరం ఎస్ఐలతో సమీక్ష నిర్వహిం చారు. పెండింగ్‌లో ఉన్న కేసులు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచిం చారు. కార్యక్రమంలో ఎస్ఐలు తిప్పేస్వామి, రవీంద్రబాబు, శివకుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి : ఎంవిఐ

సమావేశంలో మాట్లాడుతున్న ఎంవిఐ వినోద్ కుమార్

ప్రజాశక్తి-నందలూరు

ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా రోడ్డు భద్రత నియమాలు పాటించాలని రాజంపేట మోటర్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ వినోద్ కుమార్, ఎస్ఐ మహమ్మద్ జహీర్‌లు తెలిపారు. జాతీయ 35వ భద్రత మాసోత్సవాల సందర్భంగా గురువారం నందలూరు షాదీఖానాలో ఆటో డ్రైవర్లకు, సుమో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, లైసెన్సులు తప్ప నిసరిగా ఉండాలని, మద్యం సేవించి వాహనాలు నడప రాదని అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే పదివేల రూపాయలు జరిమానా విధిస్తామని, హైవేపై హెల్మెట్ తప్పనిసరి వాడాలన్నారు. ఆటో డ్రైవర్లు ఓవర్ లోడ్ ఎక్కించుకోరాదని, లైసెన్స్, ఆర్‌సి, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్, పొల్యూషన్ అన్ని పత్రాలు సక్రమంగా ఉండాలని, కొందరు ఫేక్ ఇన్సూరెన్స్ చేయించు కుంటు న్నారని ఒరిజినల్ ఇన్సూరెన్స్ చేయించుకుంటే వాహనాలు ప్రమాదం జరిగినప్పుడు ఇన్సూరెన్స్ పొందవచ్చునని అన్నారు.కార్యక్రమంలో మోటార్ వెహికల్ సిబ్బంది అంజిరెడ్డి, గణేష్, హోంగార్డు బి.వి సుబ్బారెడ్డి, వాహనాల డ్రైవర్లు పాల్గొన్నారు.

ఇసుక తరలించొద్దని రైతుల నిరసన

ప్రజాశక్తి-వీరబల్లి

నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

మండలంలోని మాండవ్యనదిలో ఇసుక రీచ్‌లకు అనుమతులు ఒకచోట ఉంటే మరోచోట ఇసుక తరలించేందుకు వచ్చిన ఓ ప్రయివేట్ సంస్థ ప్రతినిధులను స్థానికులు, రైతులు అడ్డుకున్నారు. ప్రభుత్వం నుంచి ఉన్నత అధికారుల నుంచి అనుమతులు ఉన్నాయని ఎస్ఐ చెప్పడంతో స్థానికులను, రైతులను, ఆయనతో వాదోప వాదాలకు దిగారు. ఇసుక ఎత్తివేస్తే సమీప బోర్లలో నీరు అడు గంటడంతో పాటు గ్రామాలకు తాగునీటి సమస్య తలెత్తే అవకాశం ఉందని తెలిపారు. గురువారం వీరబల్లి సమీపంలో బొంగావాండ్లపల్లి రోడ్డులో ఇసుక రీచ్ వద్దకు వచ్చిన ప్రజాప్రతినిధులను, ఎస్ఐ కూడా వెళ్ళిపోవాలని సూచించారు. ఇక్కడ ఇసుక రీచ్ ఏర్పాటు చేస్తే తాము ఆత్మహత్యలు చేసుకుంటామని అన్నారు. టిడిపి నాయకులు తాటి గుంట్ల శ్రీధర్‌రెడ్డి, తుమ్మల రమేష్, ఆంజనేయులు సంఘటన స్థలానికి చేరుకొని ఇక్కడ రీచ్ పెట్టడానికి ఒప్పుకోమని చెప్పారు.

నులిపురుగులను నిర్మూలిద్దాం : ఎంపిపి

జాతీయ నులిపురుగుల దినోత్సవం పోస్టర్ విడుదల చేస్తున్న ఎంపిపి, వైద్య సిబ్బంది

ప్రజాశక్తి-పుల్లంపేట

పిల్లల్లో నులిపురుగులను నివారించి వారి ఆరోగ్యానికి పరిరక్షిద్దామని ఎంపిపి ముద్దాబాబుల్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల ప్రాథమిక కేంద్రంలో ఎంపిపి ముద్దా బాబుల్‌రెడ్డి అధ్యక్షతన సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్థానిక వైద్యాధికారులు డాక్టర్ డాక్టర్ మనోజ్ చంద్ర మాట్లాడుతూ బాలల కడుపులో నులిపురుగులు నిర్మూలించడానికి ఉచితంగా ఆల్బెండజోల్ 400 మిల్లీగ్రాముల మాత్రలను అన్ని అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ ఎయిడెడ్, ప్రయివేట్ పాఠశాలల్లో, కళాశాలలో ఇవ్వవలసిందిగా తెలిపారు.1 నుంచి 5 సంవత్సరాలలోపు పిల్లలకు అంగన్వాడీ కేంద్రాలలో, 6-9 సంవత్సరాలలోపు పిల్లలు పాఠశాలల్లో ఈ మాత్రలు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. నులిపురుగుల సంక్రమణను సులభంగా నిర్మూలించవచ్చునని పేర్కొన్నారు. నులిపురుగులు ఉన్న పిల్లలు పోషకాహార లోపం రక్తహీనత వల్ల నీరసంగా ఉంటారని శారీరక మానసిక ఎదుగుదల లోపాలను కలిగి ఉంటారని అలాంటి వారందరికీ ఈ మాత్రం తప్ప నిసరిగా వేయించాలని తెలిపారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం రోజున డివార్మింగ్ చేయబడిన పిల్లలకు మరల ఫిబ్రవరి 16వ తేదీన మాప్అప్ ఆల్బెండజోల్ 400మి.గ్రా మాత్రను వేయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ నరసింహ కుమార్, ఎంపిడిఒ నరసింహమూర్తి, జడ్‌పిటిసి రామనాథం, ఆరోగ్య పర్యవేక్షకులు హరమ్మ, మహేష్, కుమారి, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలు లేకుండా చూడాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి-రామాపురం

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ

గ్రామాలలో ఎలాంటి సమస్యలు లేకుండా పరిష్కరించాలని గ్రామ సచివాలయ ఉద్యోగులకు ప్రజా ప్రతినిధులతో ఎంపిడిఒ ప్రభాకర్ పేర్కొన్నారు. మండల ప్రజా పరిషత్ సభా భవనంలో గురువారం మండల సర్వసభ సమావేశం ఎంపిడిఒ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ఉండే సమస్యలను ప్రజా ప్రతినిధులు దృష్టికి తీసుకువెళ్లి గ్రామస్థాయిలోనిపరిష్కరించాలని అన్నారు. మండ లంలో నాడు-నేడు పనులు పాఠశాలల్లో జరుగుతున్నాయని ప్రస్తుతం నిధులు లేక పనులు ఆగిపోయాయని ఎంఇఒ2 జయచంద్ర సభ దిష్టికి తీసుకువెళ్లారు. అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ మండలంలో ఇళ్లు నిర్మించుకున్న వారికి ఉపాధి బిల్లులు రాలేదని ఆయన అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయంపై త్వరగా లబ్ధిదారులకు ఉపాధి బిల్లులు వచ్చే విధంగా చూడాలని ఉపాధి సిబ్బందికి వారు సూచించారు. మండలంలో ప్రస్తుతం చేస్తున్న భూ రీసర్వేలో ఏ గ్రామంలో చూసినా రైతులకు అన్యాయం జరిగిందని సక్రంగా భూ రీసర్వేలో జాయింట్ నెంబర్లు సర్వేలు పేరుతో రెవెన్యూ సిబ్బంది రీ సర్వే సక్రమంగా చేయలేదని రైతులు లబోదిబో అంటున్నారని పలువురు సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. వ్యవసాయ అధికారి నాగమణి మాట్లాడుతూ రైతులు రబి సీజన్లో సాగు చేసిన పంటలకు పంట నమోదుతో పాటు ఇకెవైసి 15 తేదీల్లోపు ఆయా గ్రామ సచివాలయాల్లో రైతులు నమోదు చేసుకోవాలని ఆమె అన్నారు. సిహెచ్ఒ ఇలియాస్ మాట్లాడుతూమండలంలో 60 ఏళ్ల నిండిన వృద్ధులకు క్షయ వ్యాధి రాకుండా ప్రభుత్వం ముందు జాగ్రత్తగా చర్యలుగా గ్రామాలలో మందులు పంపిణీ చేస్తున్నామని అన్నారు. ఎంఇఒ మాట్లాడుతూ రానున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు సంబంధించి పాఠశాలలో విద్యార్థులకు ముందుగా ప్రత్యేక తరగతులను నిర్వహిస్తామన్నారు. ప్రయివేట్ పాఠశాల దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్య గణనీయంగాపెరిగిందన్నారు. మరమ్మతులు చేయుటకు కాంట్రాక్టు ముందుకొచ్చినా సిమెంటు లేక నిర్మాణ పనులు ఆగిపోయాయని పలువురు ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకొచ్చారు.అంగ న్వాడీ సెంటర్లను ఆ గ్రామ సర్పంచ్‌లు, ఎంపిటిసిలు గ్రామస్థాయి అధికారులు వారానికి రెండు మార్లు తనిఖీ చేయాలని అన్నారు. అనంతరం ఎపిఒ సురేంద్ర రెడ్డి మాట్లాడుతూ 2020-24 సంవత్సరానికి సంబంధించి మామిడి మొక్కలు నాటుకున్న రైతులను గుర్తించామని త్వరలో జూన్, జూలై నెలల్లో ప్లాంటేషన్ కూడా పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి వెంకటరమణ, మండల ఉపా ధ్యక్షులు రవిశంకర్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు అయోధ్య పురం భూషణ్ రెడ్డి, సింగల్ విండో అధ్యక్షులు పెద్దిరెడ్డి, తహశీల్దార్ అరవింద కిషోర్, రేఖం నారాయణ, మండల స్థాయి, గ్రామస్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

బాధితుడికి చెక్కును అందిస్తున్న ముక్కా సాయివికాస్‌రెడ్డి

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-చిట్వేలి

మండల పరిధిలోని తిమ్మయ్యగారిపల్లి దళితవాడకు చెందిన జోరోపల్లి శివకుమార్ గత కొద్దిరోజులుగా ఉదర సంబంధిత వ్యాధితో బాధపడుతుండటంతో విషయం తెలుసుకున్న ముక్కా సాయివికాస్‌రెడ్డి ముక్కా ఫౌండేషన్ తరుపున రూ.25వేలు ఆర్థిక సాయం అందించారు. గ్రామస్తుల సాయం అందించిన సాయివికాస్‌రెడ్డి అభినందనలు తెలిపారు కార్యక్రమంలో నవీన్, రమణ శివ, నరసయ్య, ఉదయ్ భాస్కర్, పీరయ్య పాల్గొన్నారు.

గ్యాస్ వినియోగదారులకు ఇకెవైసి తప్పనిసరి

ప్రజాశక్తి-రామాపురం

మండల పరిధిలోని ప్రభాకర్ ఇండియన్ గ్యాస్ వినియోగదారులు అంద రూ కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు ఇకెవైసి తప్పకుండా చేయించుకోవాలని ఇండి యన్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ సివి.సుబ్బారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉచిత గ్యాస్ కనెక్షన్లు ఇచ్చిన దృష్ట్యా చాలా మందికికనెక్షన్లు అందించామని తెలిపారు. గ్యాస్ కావాలను కున్న వారు ముం దుగా గ్యాస్ బుకింగ్ చేసు కున్నట్లయితే వారికి సకాలంలో గ్యాస్ అందేటట్లు చూస్తు న్నామని అన్నారు. ఇకెవైసి చేయించుకోవడం వల్ల ఎవరికైతే గ్యాస్ కనెక్షన్ ఉంటుందో వారికే కేంద్ర ప్రభుత్వం నుంచి లబ్ధి పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ అవకా శాన్ని గ్యాస్ వినియోగ దారులందరూ తప్పకుండా గ్యాస్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు.

19 నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

మండలంలోని కోసవారిపల్లెలోని ప్రసన్న వెంకటరమణ ఆలయంలో శుక్రవారం అంకురార్పణ కార్యక్రమంతో వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమై 19వ తేదీ పుష్పయాగం కార్యక్రమంతో ముగుస్తాయని టిటిడి డిప్యూటీ ఇఒ వరలక్ష్మి, ఎఇఒ గోపీనాథ్, ఆలయ ఇన్స్‌పెక్టర్ దిష్యంత్ కుమార్‌లు తెలిపారు.టిటిడి ఆధ్వర్యంలో ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించి సుందరంగా ముస్తాబు చేశారు.స్థానిక ప్రజల ఆర్థిక సహకారంతో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

జయహో బిసి సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-పెద్దమండ్యం

మండల కేంద్రంలోని పెద్దమండ్యంలో బస్టాండ్ దగ్గర శుక్రవారం జరిగే జయహో బిసి సభను జయప్రదం చేయాలని మండల అధ్యక్షులు జిట్టా వెంకటరమణ పిలుపునిచ్చారు. తంబళ్లపల్లి మాజి ఎమ్మెల్యే జి. శంకర్‌యాదవ్ ఆదేశాలు మేరకు జయహో బిసి సభ ఉదయం 10.30 గంటలకు మొదలవుతుందని తెలిపారు.టిడిపితోనే బిసిలకు సముచిత న్యాయం జరుగుతుందన్నారు. బిసిల సంక్షేమానికి పాటుపడేది చంద్రబాబునాయుడు మాత్రమేనన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టిడిపికి అండగా ఉండి గెలిపించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డి బిసిలపై కపట ప్రేమ ప్రదర్శిస్తున్నారని, బిసి సంక్షేమానికి ఎటువంటి కృషి చేయలేదన్నారు. చంద్రబాబుకు అండగా ఉండి గెలిపించుకుందామని అన్నారు. ఈ సభకు టిడిపి, జనసేన నాయకులు, మండల కన్వీనర్లు, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు, నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం కోరారు.

క్రైం కార్నర్

గొంతు కోసుకొని వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

స్థానిక ఇందిరాకాలనీలో నివాసముంటున్న వెంకటరమణ (58) అనే వ్యక్తి ఒంటరి జీవితంపై విరక్తి చెంది గురువారం ఉదయం గొంతు కోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు గమనించి బాధితుడిని చికిత్స కోసం వెంటనే మదనపల్లి జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు.ఆస్పత్రి అత్యవసర విభాగం డాక్టర్లు పరీక్షించి, ప్రథమ చికిత్స అనంతరం అతని పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించాలని సూచించారు. ఆస్పత్రి అవుట్ పోస్టు పోలీసుల సమాచారంతో బికొత్తకోట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-పెద్దమండ్యం

కర్ణాటక మద్యం విక్రయిస్తున్న యువకుడిని పెద్దమండ్యం పోలీసులు అరెస్టు చేశారు. పెద్దమండ్యం ఎస్ఐ వెంకటేష్ కథనం మేరకు..పెద్దమండ్యంలో నివాసమున్న దశరథ్ గత కొంత కాలంగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం వచ్చింది అన్నారు. సిబ్బందితో వెళ్లి దశరథ్ ఇంట్లో సోదాలు చేపట్టి మద్యం స్వాధీనం చేసుకు న్నామని తెలిపారు. దశరథ్‌ను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ బిఎస్ఎఫ్ సైనికుడు మృతి

ప్రజాశక్తి-ములకలచెరువు

రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ బిఎస్ఎఫ్ సైనికుడు మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన మేరకు.. మండలంలోని చౌడ సముద్రం పంచాయతీ చుంచువారిపల్లి చెందిన నాగభూషణంనాయుడు(57) 22 ఏళ్ల పాటు బిఎస్ఎఫ్‌లో పనిచేశారని చెప్పారు. రిటైర్ అనంతరం బెంగళూరు రిలయన్స్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. నాగభూషణం నాయుడు కుటుంబం మదనపల్లి కాపురం ఉంటున్నారు. బుధవారం ఉదయం బెంగళూరుకు వెళుతుండగా హెూస్కోట్ సమీపంలో నాగభూషణనాయుడు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా వస్తున్న కారు ఢీ కొట్టిందన్నారు. ఈ ప్రమాదంలో నాగభూషణం నాయుడు తీవ్రంగా గాయపడినట్లు తెలిపారు. బెంగళూరులో ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని తెలిపారు. నాగభూషణం నాయుడు మృతి చెందిన విషయం తెలుసుకున్న కలికిరి బిఎస్ఎఫ్ ఎస్ఐ తిమ్మిరెడ్డి, అన్నమయ్య జిల్లా బిఎస్ఎఫ్ సంఘం అధ్యక్షులు సుబ్రహ్మణ్యం రెడ్డిలు సుంచువారిపల్లి చేర్చుకుని అంత్యక్రియల కోసం ఆర్థిక సాయాన్ని కుటుంబ సభ్యులకు అందించారు. నాగభూషణ్ నాయుడుకు భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత

ప్రజాశక్తి-కలికిరి

తల్లి మందలించిందని ఇంటి నుంచి పారిపోయిన బాలుడి ఆచూకీ కనుగొని అప్పగించిన సంఘటన గురువారం కలికిరిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నిమ్మనపల్లి మండలం, ముష్టూరు పంచాయతీ, వలసపల్లిలో నివాసమున్న శోభారాణి కుమారుడు చరణ్ తల్లి మందలించడంతో ఇంటి నుంచి పారిపోయి వచ్చాడని తెలిపారు. కలికిరి పట్టణంలో సంచరి స్తుండగా స్థానికులు పోలీసులకు సమాచారం అందించారని చెప్పారు. సిఐ మోహన్ బాలుడిని చేరదీసి బాలుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి బాలుడిని జాగ్రత్తగా చూసుకోవాలని కౌన్సిలింగ్ ఇచ్చి అప్పగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ చలపతి, ఎఎస్ఐ మధుసూదనాచారి పాల్గొన్నారు.

ఆరుగురు పేకాటరాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి-కలికిరి

ఆరుగురు పేకాట రాయుళ్లను అరెస్టు చేసినట్లు కలికిరి సిఐ మోహన్ తెలిపారు. మండల పరిధిలోని మర్రికుంటపల్లి గ్రామం, గజ్జలవారిపల్లికి పడమర దిక్కున గల చింత చెట్టు క్రింద, పేకాట ఆడుతున్నట్లు సమాచారంతో తమ సిబ్బందితో దాడులు చేసి వారి ఆరుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.5,300 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈదాడులో ఎఎస్ఐ మధుసూదనచారి, హెచ్‌సి రాజేంద్ర ప్రసాద్, పిసిలు రాజా, జిలానీ, మునిరత్నం, వెంకట శిద్దులు, హోంగార్డు రామాంజులు పాల్గొన్నట్లు తెలిపారు.